# ఎవరెస్టు.. చెత్తమయం!

- ప్రపంచంలోనే ఎత్తైన డంపింగ్ యార్డ్‌గా మారుతున్న ప్రముఖ హిమ శిఖరం
- పేరుకుపోయిన 50 టన్నుల వ్యర్థాలు



న్యూఢిల్లీ: ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన పర్వత శిఖరం ఎవరెస్ట్ చెత్తకుప్పగా మారుతున్నది. 8,848 మీటర్ల ఎత్తు ఉండే ఈ శిఖరంపై టన్నుల కొద్దీ చెత్త పేరుకుపోతున్నది. ఎవరెస్ట్ అధిరోహణకు ఏటా వేలా మంది పర్వతారోహకులు వెళ్తుంటారు. వీరంతా వాడి పడేసే వస్తువులు, ఇతరత్రా వాటి వల్ల ఎవరెస్టు పర్వతం ప్రపంచంలోనే ఎత్తయిన వ్యర్థ పదార్థాల డంపింగ్‌గా మారుతున్నది. గత కొన్నేండ్ల కార్యకలాపాల వల్ల పర్వతంపై 50 టన్నుల మేర చెత్త మిగిలి ఉండే అవకాశం ఉన్నదని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఎవరెస్టు బేస్ క్యాంపు వద్ద ప్రతి సీజన్‌లో 75 టన్నుల వ్యర్థాలను తొలగిస్తుంటారు. ఇంకా పలు ప్రాంతాల్లో చెత్త పేరుకుపోవడం, దాన్ని తొలగించడం ప్రతి ఏడాది ఒక నిరంతర ప్రక్రియగా మారింది.

**వేలాదిగా పర్యాటకుల రాకతో..**

ఎవరెస్టు పర్వతం, దాని సమీపంలోని సాగరమాత నేషనల్ పార్క్‌కు ఏటా వేలాది మంది పర్యాటకులు వస్తుంటారు. 2014, 2017 మధ్య ఈ సంఖ్య రెట్టింపు అయింది. ప్రస్తుతం ప్రతి ఏడాది 60 వేల మంది వరకు విదేశీ పర్యాటకులు పార్కుకు వస్తున్నారు. వీరికి అదనంగా వేలాది నేపాలీ గైడ్స్ ఉంటుంటారు. వీరు ప్రతి ఏడాది 1,000 టన్నుల వ్యర్థాలను వదిలి వెళ్తారని ఒక అంచనా. అయితే ఇందులో చాలా వరకు పార్కులోనే ఉండిపోతున్నది. ప్రధానంగా పర్వతారోహణను ప్రారంభించే ఎవరెస్టు బేస్ క్యాంపు వద్ద అధికంగా వ్యర్థాలు పడి ఉంటున్నాయి. క్యాంపుల వద్ద ఉండే చెత్తను చాలా వరకు శుభ్రం చేస్తున్నప్పటికీ, పర్వతంపై ఉండే వ్యర్థాల మొత్తాన్ని క్లీన్ చేయడం సాధ్యపడటం లేదు.

**నాల్గవ క్యాంపులో మరీ దారుణం**

ఎవరెస్టుపై అత్యంత కాలుష్య ప్రాంతంగా నాల్గవ క్యాంపు ఉన్నది. ఇది పర్వతారోహకులు చివరగా ఆగే స్థలం. సముద్ర మట్టానికి 7,900 మీటర్ల ఎత్తులో ఉండే, డెత్ జోన్‌గా పిలిచే ఈ ప్రాంతం నుంచి వ్యర్థాలను తీసుకురావడం అంత సులభం కాదని ది ఎవరెస్టు ప్రాజెక్టు సీఈవో కౌఫ్‌మాన్ పేర్కొన్నారు. ఈ సైట్ వద్ద పర్వతారోహకులు కొంత సేపు మాత్రమే ఆగుతారు. తమ ప్రాణాలకు ముప్పు పొంచి ఉండే నేపథ్యంలో కిందకు దిగి వచ్చే సమయంలో చాలా త్వరగా వచ్చేస్తారు. ఈ క్రమంలో తమకు సంబంధించిన టెంట్లు, ఆక్సిజన బాటిళ్లు, స్టీల్ గిన్నెలు, స్పూన్లు వంటివి అక్కడే వదిలేస్తారు.

### నిబంధనలు పెట్టినా కానరాని పరిష్కారం

వ్యర్థాల నిర్వహణను సాగరమాత పొల్యూషన్ కంట్రోల్ బోర్డు(ఎస్‌పీసీసీ) చేపడుతున్నది. 2014 నుంచి ఎవరెస్టు బేస్ క్యాంపును దాటి వెళ్లిన వారు తిరిగి 8 కేజీల వ్యర్థాలను తమ వెంట కిందకు తీసుకురావాలనే నిబంధన పెట్టారు. లేకుంటే 4 వేల డాలర్లు(రూ.3.3 లక్షలు) డిపాజిట్‌ను కోల్పోవాల్సి ఉంటుంది. వ్యర్థాల నిర్వహణకు ఎస్‌పీసీసీ ఎంత ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ, సమస్య పూర్తిగా పరిష్కారం అవుతున్నట్టు కనిపించడం లేదు. మరో వైపు ఎవరెస్టుపై చెత్తను తొలగించడంలో నేపాల్ సైన్యం కూడా సహకారం అందిస్తున్నది. 2022లో ఎవరెస్టు, దాని చుట్టుపక్కల ప్రాంతాల్లో 34 టన్నుల వ్యర్థాలను తొలగించామని ఆర్మీ పేర్కొన్నది.

## వధువుకు వరుడు ముద్దు.. కొట్టుకున్న ఇరు కుటుంబాలు

లక్నో: ఉత్తరప్రదేశ్‌లోని హాపూర్, అశోక్ నగర్‌లో వివాహ వేదిక యుద్ధ క్షేత్రంగా మారింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, పెండ్లిలో వధూవరులు వర మాలలను వేసుకునే సమయంలో, వధువును వరుడు ముద్దాడాడు. దీన్ని చూసిన వధువు బంధువులు ఆగ్రహంతో వరుని బంధువులతో వాగ్వాదానికి దిగారు. ఆ తర్వాత కర్రలతో వివాహ వేదికపైకి ఎక్కి, వరుని బంధువులపై దాడి చేశారు. వధువు తండ్రితోపాటు ఆరుగురు గాయపడ్డారు. ఈ సమాచారం అందుకున్న పోలీసులు వచ్చి, ఇరు కుటుంబాలకు చెందిన కొందరిని అదుపులోకి తీసుకున్నారు. గాయపడినవారిని స్థానిక దవాఖానకు తరలించారు. వధువు తండ్రి తన ఇద్దరు కుమార్తెలకు సోమవారం రాత్రి పెండ్లి చేయడానికి ఏర్పాట్లు చేశారు. మొదటి కుమార్తె వివాహం ప్రశాంతంగా జరిగింది. కానీ రెండో కుమార్తె వివాహం సమయంలో ఈ ఘర్షణ జరిగింది.

## స్నేహితుడే సూత్రధారి.. 5 కోట్ల సుపారీ

**బంగ్లాదేశ్ ఎంపీ హత్య కేసు**

కోల్‌కతా: వైద్య చికిత్స కోసం కోల్‌కతాకు వచ్చి హత్యకు గురైన బంగ్లాదేశ్ అధికార పార్టీ ఎంపీ అన్వరుల్ అజీమ్ అనర్ కేసులో విస్తుపోయే నిజాలు వెలుగులోకి వస్తున్నాయి. అన్వరుల్‌ను హత్య చేయడానికి అతని స్నేహితుడే రూ.5 కోట్లకు సుపారీ ఇచ్చాడని సీనియర్ పోలీస్ అధికారి గురువారం వెల్లడించారు. ప్రస్తుతం అమెరికాలో నివసిస్తున్న ఆ వ్యక్తికి కోల్‌కతాలోని న్యూటౌన్ ప్రాంతంలో ఒక ఫ్లాట్ కూడా ఉందని చెప్పారు. ఈ ఫ్లాట్‌లోనే రక్తపు మరకలు, కొన్ని ప్లాస్టిక్ సంచులను దర్యాప్తు బృందం గుర్తించింది. ప్రాథమిక ఆధారాలను బట్టి ఎంపీని తొలుత గొంతు పిసికి హత్య చేసి తర్వాత మృతదేహాన్ని ముక్కలుగా నరికి బ్యాగ్‌లలో తరలించి వివిధ ప్రదేశాల్లో పారవేసినట్టు భావిస్తున్నామని సీఐడీ ఐజీ అఖిలేశ్ చతుర్వేది తెలిపారు. ఇది ముందస్తు ప్రణాళికతో జరిపిన హత్య అని, ఎంపీని చంపమని అతని స్నేహితుడే రూ.5 కోట్ల సుపారీ ఇచ్చారని చెప్పారు.



### 16 ఏండ్లకే ఎవరెస్ట్ అధిరోహణ రికార్డులకెక్కిన కామ్యా కార్తికేయన్

*జంషెడ్‌పూర్: భారత్‌కు చెందిన 16 ఏండ్ల కామ్యా కార్తికేయన్ ఎవరెస్ట్ అధిరోహించి ఆ ఘనత సాధించిన అతిపిన్న వయస్కురాలైన భారతీయురాలిగా రికార్డులకెక్కింది. నేపాల్ వైపు నుంచి ఆమె ఎవరెస్ట్‌ను అధిరోహించినట్టు టాటా స్టీల్ ఎడ్వంచెర్ ఫౌండేషన్ (టీఎస్ఏఎఫ్) గురువారం తెలిపింది.*

## నీట్ ప్రశ్నపత్రానికి రూ.30-50 లక్షలు

- తల్లిదండ్రులు చెల్లించినట్టు ఒప్పుకున్న విద్యార్థులు
- పేపర్ లీక్ వ్యవహారంలో బయటకొస్తున్న నిజాలు

పట్నా, మే 23: నీట్ యూజీ ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారంలో బీహార్ పోలీస్ శాఖ ఆర్థిక నేరాల విభాగం కీలక విషయాలను వెల్లడించింది. ప్రశ్నపత్రం కోసం తమ తల్లి దండ్రులు రూ.30 - 50 లక్షల వరకు చెల్లించారని నిందితులుగా ఉన్న విద్యార్థులు ఒప్పుకున్నారని, ఈ లావాదేవీలకు సంబంధించిన ఆధారాలు కూడా సేకరించినట్టు తెలిపింది. సికందర్ యదవేందు అనే లైన్‌మెన్, దనపూర్ నగర పరిషత్‌లో జూనియర్ ఇంజినీర్‌గా పని చేస్తున్న వ్యక్తి తమకు పరీక్షకు ముందే ప్రశ్నపత్రం లీక్ చేశారని విద్యార్థులు అంగీకరించారని వెల్లడించింది. ఇప్పటికి ఈ కేసులో లైన్‌మెన్, ఓ డ్రైవర్, విద్యార్థులు, తల్లి దండ్రులు సహా 13 మందిని అరెస్టు చేశామని, బీహార్, ఇతర రాష్ర్టాలకు చెందిన మరో ఆరుగురు విద్యార్థులను నిందితులుగా గుర్తించామని పోలీసులు చెప్పారు. లైన్‌మెన్‌కు ప్రశ్నపత్రం ఇచ్చిన గ్యాంగ్‌ను గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నట్టు తెలిపారు. వైద్యవిద్యలో ప్రవేశాల కోసం దేశవ్యాప్తంగా మే 5న నీట్ యూజీ పరీక్షను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించింది. అయితే, బీహార్‌లో పరీక్ష ప్రశ్నాపత్రం లీక్ అయిందని ఆరోపణలు రావడంతో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



### కాళ్లూ, చేయి లేకున్నా..

*పనాజీ: ఓ చేతిని, రెండు కాళ్లను కోల్పోయిన దివ్యాంగుడు టింకేష్ కౌశిక్ (30) ఎవరెస్ట్ పర్వతం బేస్ క్యాంప్‌పైకి చేరుకుని రికార్డు సృష్టించారు.* కౌశిక్ తొమ్మిదేళ్ల వయసులో హర్యానాలో విద్యుదాఘాతానికి గురయ్యారు. దీంతో ఓ చేతిని, రెండు కాళ్లను కోల్పోయారు. ఆయన కృత్రిమ అవయవాలను వాడుతున్నారు. ప్రస్తుతం గోవాలో ఆయన ఫిట్‌నెస్ ట్రైనర్‌గా పని చేస్తున్నారు.

## పుణె కారు నడిపింది డ్రైవర్?

పుణె, మే 23: పుణెలో ఇద్దరు యువకుల మరణానికి కారణమైన రోడ్డు ప్రమాదంలో కొత్త కోణం తెరపైకి వచ్చింది. పోర్షే కారును మైనర్(17) నడిపాడని ఇప్పటివరకు పోలీసులు భావించారు. అతడిపైనే కేసు నమోదైంది. ప్రస్తుతం జువైనెల్ సెంటర్‌కు మైనర్‌ను తరలించారు. కాగా, ఈ ప్రమాదం జరిగినప్పుడు కారును నడిపింది తమ డ్రైవర్ అని మైనర్ బాలుడి తండ్రి విశాల్ అగర్వాల్ పేర్కొన్నారు. ఘటన సమయంలో కారులో ఉన్న మైనర్ బాలుడి స్నేహితులు ఇద్దరు కూడా కారును డ్రైవరే నడిపాడని తెలిపారు. ప్రమాద సమయంలో తానే కారును నడిపానని డ్రైవర్ కూడా పోలీసుల ముందు అంగీకరించాడు. దీంతో కేసు కొత్త మలుపు తీసుకుంది. అయితే, కేసు నుంచి మైనర్‌ను తప్పించేందుకే డ్రైవర్‌ను ఇరికిస్తున్నారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

## కెమికల్ ఫ్యాక్టరీలో అగ్ని ప్రమాదం

- 8మంది మృతి, 60 మందికి గాయాలు.. మహారాష్ట్రలో ఘటన

ముంబై, మే 23: కెమికల్ ఫ్యాక్టరీలో భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఫ్యాక్టరీలోని నాలుగు బాయిలర్లు పేలడంతో 8మంది మరణించగా, 60 మందికి పైగా గాయపడ్డారు. మహారాష్ట్రలోని థాణే జిల్లా డోంబివిలిలో గురువారం ఈ విషాద ఘటన చోటుచేసుకుంది. ఎంఐడీసీ కాంప్లెక్స్‌లోని అంబర్ కెమికల్ కంపెనీలో మధ్యాహ్నం జరిగిన ఈ ప్రమాదంలో నాలుగు బాయిలర్లు పేలి భారీగా మంటలు వ్యాపించినట్టు అధికారులు తెలిపారు. ఫ్యాక్టరీ ఆవరణలో ఉంచిన కెమికల్ డ్రమ్ములకు సైతం మంటలంటుకోవడంతో అవి కూడా పేలి పక్కనున్న గృహాలకు మంటలు వ్యాపించాయి.














